సాక్షి కామారెడ్డి

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



ఫిర్యాదులను పరిష్కరించాలి
ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.
- 8లో ▸



హోరాహోరీగా..
శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాలలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
40.1/20.2

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అల్మాజీపూర్‌లో బోనాల పండుగ



ఎల్లారెడ్డి: అల్మాజీపూర్ గ్రామంలో సోమవారం బోనాల పండుగ నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవంలో భాగంగా గ్రామంలోని ముత్యాల పోచమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లకు మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించి అమ్మవారికి బోనాలను సమర్పించారు. అందరూ సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

చిన్నారులకు కంటి పరీక్షలు



కామారెడ్డి టౌన్: జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ, ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు కంటి పరీక్షల కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మొదటి రోజు జిల్లాలో 1,077 మందికి కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రెండు దశలలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. మొదటి దశలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి రెండో దశలో అవసరమైన చిన్నారులకు కంటి అద్దాల పంపిణీ, శస్త్ర చికిత్సలు చేపడుతామని పేర్కొన్నారు. అలాగే మానసిక పరీక్షలు కూడా చేస్తామన్నారు. జిల్లాలోని 1,205 అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులందరికి పరీక్షలు చేస్తామని, ఇందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలి



కామారెడ్డి రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని డీసీవో రామ్మోహన్ సూచించారు. సోమవారం గర్గుల్, నర్సన్నపల్లి, ఉగ్రవాయి, ఇస్రోజీవాడి, చిన్నమల్లారెడ్డి, అడ్లూర్ ఎస్సీ కాలనీ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వం కల్పించే మద్దతు ధరను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ధర్మగోని లక్ష్మీరాజాగౌడ్, మానిటరింగ్ ఆఫీసర్ షేక్ చాంద్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొంబొతుల శంకర్‌గౌడ్, డైరెక్టర్లు గంగాగౌడ్, రాంరెడ్డి, లక్ష్మీనారాయణ, దుబ్బాక పోచయ్య, కల్లూరి భూమయ్య, సీఈవో సతీష్, మాజీ సీఈవో మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి



భిక్కనూరు: గ్రామపంచాయతీలు వందశాతం ఇంటిపన్నులను వసూలు చేస్తే వేగంగా అభివృద్ధి సాధించవచ్చని డీపీవో మురళి పేర్కొన్నారు. సోమవారం ఆయన పెద్దమల్లారెడ్డిని సందర్శించారు. తడి పొడి చెత్తను వేరువేరుగా అందించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని పారిశుద్ధ్య సిబ్బందికి సూచించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కమ్యూనిటీ బోర్ల వద్ద నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు అక్కడ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. డీపీవో వెంట ఈవో లక్ష్మి ఉన్నారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్టు

కామారెడ్డి టౌన్ : గిరిజన భవనం ముట్టడిని అడ్డుకునేందుకు గిరిజన సంఘం జిల్లా నాయకులను సోమవారం పట్టణ పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతీరాం నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్‌లను ఉదయం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.



161వ నంబరు జాతీయ రహదారి

అక్రమాలకు అడ్డదారి!

- జీరో మాల్, అధిక లోడు వాహనాలన్నీ చిన్నరోడ్ల పైనుంచే..
- ఎన్‌హెచ్ 161పై చెక్‌పోస్టులను తప్పించుకోవడానికి..
- మహారాష్ట్ర నుంచి తెలంగాణకు సరుకు రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి గండి



మహారాష్ట్ర నుంచి వచ్చే సరుకుల రవాణా వాహనాలు.. అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను తప్పించుకునేందుకు అడ్డదారిలో వెళ్తున్నాయి. ముఖ్యంగా జీరో మాల్ తీసుకువెళ్లే వారు, అధిక లోడుతో వెళ్లే వాహనాలు, నిషేధిత మత్తు పదార్థాలతో పాటు మహారాష్ట్ర నుంచి దేశీదార్ మద్యం ఈ దారి గుండానే రవాణా చేస్తున్నారు. రవాణా వాహనాలు చాలా వరకు అడ్డదారిలో వెళ్తుండడంతో ప్రభుత్వాల ఆదాయానికీ గండిపడుతోంది. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : నాందేడ్ నుంచి సంగారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు 161వ నంబరు జాతీయ రహదారి మీదుగా వెళ్తాయి. అయితే తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో సలాబత్‌పూర్ వద్ద ఇరు రాష్ట్రాల చెక్ పోస్టులు ఉన్నాయి. వీటిని తప్పించుకునేందుకు అడ్డదారులు ఉపయోగించుకుంటున్నారు. చాలా వరకు వాహనాలు మహారాష్ట్రలోని దెగ్లూర్ నుంచి పెద్ద శక్కర్గ, నాగ్రాల్ గ్రామాల మీదుగా మద్నూర్ మండల కేంద్రానికి సమీపంలోని 161 వ నంబరు జాతీయ రహదారి బైపాస్ మీదుగా హైదరాబాద్ వైపు వెళ్తున్నాయి. అధిక లోడుతో వెళ్తున్న వాహనాలతో పాటు సరైన రవాణా పత్రాలు లేని, అక్రమ సరకులు రవాణా చేసే, నిషేధిత మత్తు పదార్థాలు తరలించే వాహనాలన్నీ ఈ అడ్డదారి మీదుగానే వెళ్తున్నాయి. ఉత్తర భారతం నుంచి మహారాష్ట్ర మీదుగా హైదరాబాద్‌కు వచ్చే సరకు రవాణా వాహనాలు కూడా చెక్‌పోస్ట్‌ను తప్పించుకోవడానికి అడ్డదారుల్లోనే పయనిస్తున్నాయి. చీకటి పడిందంటే చాలు వాహనాలు వరుస కడుతాయని, రాత్రంతా వాహనాల రాకపోకలు సాగిస్తాయని తెలుస్తోంది.



చెక్‌పోస్టులను తప్పించుకుని వెళ్లేందుకు ఉపయోగిస్తున్న అడ్డదారులు

దెబ్బతింటున్న రోడ్లు

అధిక లోడుతో వెళ్లే వాహనాలతో రోడ్లు దెబ్బతింటున్నాయి. రూ. కోట్లు ఖర్చు చేసి వేసిన రోడ్లు కొద్ది కాలానికే పాడవుతున్నాయి. తనిఖీల నుంచి తప్పించుకునేందుకు అడ్డదారిలో వెళ్లే వాహనాలతో ప్రభుత్వాదాయానికి గండి పడుతుండగా, రోడ్లు కూడా దెబ్బతినడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలు కూడా మద్నూర్ నుంచి ఇదే అడ్డదారి గుండా మహారాష్ట్రకు తరలుతున్నాయి. అలాగే మరోవైపు ఇసుకను కర్ణాటకకు మద్నూర్ నుంచి జుక్కల్ మీదుగా తరలిస్తున్నారు. మద్నూర్ మండల కేంద్రం నుంచి జుక్కల్‌కు వెళ్లే ఈ రహదారి అటు కర్ణాటకకు, ఇటు మహారాష్ట్రకు వాహనాలు తరలివెళ్లడానికి అనువుగా ఉంది. దీంతో చాలా మంది ఈ దారిని అక్రమ రవాణాకు ఉపయోగించుకుంటున్నారు. దీనిపై జిల్లా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

దర్జాగా తిరుగుతున్నా..

చెక్‌పోస్టులను తప్పించుకునేందుకు సరుకు రవాణా వాహనాలు అడ్డదారిలో దర్జాగా తిరుగుతున్నాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ దారి గుండా వెళ్తున్నట్టు తెలుస్తోంది. చెక్‌పోస్టుకు కూతవేటు దూరం నుంచే వాహనాలు దారి మళ్లుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. మహారాష్ట్రకు చెందిన దేశీదారు (మద్యం) ఈ దారి గుండా వివిధ ప్రాంతాలకు రవాణా అవుతున్నట్లు తెలుస్తోంది. స్థానికంగా దొరికే మద్యం కన్నా తక్కువ ధరలకు లభిస్తుండడంతో చాలా మంది దేశీదారు తాగడానికే మొగ్గు చూపుతున్నట్టు సమాచారం.

వివాదాల పరిష్కార వేదికలు

- జిల్లాలో 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ల ప్రారంభం
- వర్చువల్‌గా ప్రారంభించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజయ్ పాల్

కామారెడ్డి టౌన్: కమ్యూనిటీ మీడియేషన్ కేంద్రాలు వివాదాలను పరిష్కరించడానికి వేదికగా ఉంటాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుజయ్ పాల్ పేర్కొన్నారు. సోమవారం జిల్లాలో నూతనంగా 12 కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ల(సమాజ మధ్యవర్తిత్వ కేంద్రాలు)ను ఆయన హైదరాబాద్‌నుంచి వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. సదాశివనగర్, బాన్సువాడ, మద్నూర్, లింగంపేట, నిజాంసాగర్, గాంధారి, రాజంపేట, ఎల్లారెడ్డి, బిచ్కుంద, నాగిరెడ్డిపేట, భిక్కనూరు, జుక్కల్‌లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని కోర్టు భవనంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్, కార్యదర్శి టి.నాగరాణి, అడిషనల్ జిల్లా న్యాయమూర్తి లాల్‌సింగ్ నాయక్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సమాజంలో శాంతి, సామరస్యాన్ని పెంపొందించడానికి మీడియేషన్ కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రలీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటికి జిల్లా న్యాయమూర్తులు డైరెక్టర్లుగా, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శులు కోఆర్డినేటర్లులుగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.సుధాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఏజీపీ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, న్యాయవాదులు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సూపరింటెండెంట్ చంద్రసేన్‌రెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



కామారెడ్డి జిల్లా కోర్టులో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

దౌల్తాపూర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

బిచ్కుంద: దౌల్తాపూర్‌లో వైద్య సిబ్బంది సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కీళ్లు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న ఎనిమిది మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. గ్రామంలో ప్రజలు విష జ్వరాలతోపాటు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న అంశంపై 'సాక్షి'లో ఆదివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం వైద్య సిబ్బంది గ్రామానికి వెళ్లి సర్వే చేసి జ్వరంతో బాధపడుతున్నవారికి మాత్రలు అందించారు. అయితే చికున్ గున్యా లక్షణాలతో బాధపడుతున్నా తమకు వైద్య పరీక్షలు నిర్వహించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్పందించిన వైద్యాధికారులు సోమవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురినుంచి రక్త నమూనాలు సేకరించారు. జ్వరం, నొప్పులకు సంబంధించిన మందులు అందించారు. కొందరికి నొప్పులు, జ్వరం ఎక్కువగా ఉండడంతో బిచ్కుంద ఆస్పత్రిని తరలించారు.

కాగా దౌల్తాపూర్‌లో రక్త నమూనాల సేకరణకు వచ్చిన వైద్య సిబ్బంది అత్యుత్సాహం ప్రదర్శించి ప్రజలతో దురుసుగా వ్యవహరించారు. దీనిపై ప్రజలు నిరసన తెలిపారు. వైద్య సిబ్బంది తీరుపై ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు.



రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

'సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మకం'



మాచారెడ్డిలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ



లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తూ..

మాచారెడ్డి : దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించిందని, ఇది చరిత్రాత్మకమైనదని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం మాచారెడ్డిలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాదయాత్ర చేశారు. గ్రామంలో రేషన్ దుకాణం వద్ద సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం దళితుల ఇంట్లో భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నబియ్యం సరఫరాలో అవకతవకలు జరగనీయవద్దని, ఏమైనా లోటుపాట్లు ఉంటే సవరించాలని అధికారులను ఆదేశించారు. కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, సభ్యుల నమోదు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అనంతరం సొసైటీలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ విక్టర్, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో గోపిబాబు, జై బాపు, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమ కామారెడ్డి ఇన్‌చార్జి కత్తి వెంకటస్వామి, డీసీసీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావ్, మాజీ ఎంపీపీ నర్సింగరావు, నాయకులు నౌసీలాల్, ఇలియాస్, ఇంద్రకరణ్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, రాజమౌళి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగనీయొద్దు

- అవసరమైన టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు ఐకేపీ ఆధ్వర్యంలో 15, సింగిల్ విండోల ఆధ్వర్యంలో 153 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామన్నారు. మిగిలిన 278 కేంద్రాలను వెంటనే ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కొనుగోళ్ల ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రాలలో తగినన్ని టార్పాలిన్‌లను అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు 271 మంది రైతుల నుంచి 2,958 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి రూ.45 లక్షలను 31 మంది రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేశామన్నారు. ధాన్యం విక్రయించిన ప్రతి రైతుకు 24 గంటల్లోగా డబ్బులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ (08468 -220051) ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున బాబు, డీఏవో తిరుమల ప్రసాద్, మార్కెటింగ్ అధికారి రమ్య, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంతిని ఘనంగా నిర్వహించాలి

మహాత్మా జ్యోతీబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఎస్సీ, బీసీ సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఉత్సవాలకు హాజరై విజయవంతం చేయాలన్నారు. అధికారులు సమన్వయం చేయాలని సూచించారు.

కల్తీ కల్లుకు కేరాఫ్ దుర్కి

బలవుతున్న అమాయకులు

- తాజాగా 60 మందికి అస్వస్థత
- మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు 12 మంది తరలింపు



అంకోల్ పంచాయతీలో రాత్రి వేళలోనూ పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు



ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య



బాన్సువాడ ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ/నస్రుల్లాబాద్ : మత్తెక్కించే కల్లు.. వ్యాపారులకు కాసులు కురిపిస్తుండగా, అమాయకుల ప్రాణాలను తీస్తోంది. కిక్కు కోసం కల్తీ కల్లుకు బానిసవుతున్న పలువురు అనారోగ్యంబారిన పడుతున్నారు. నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలోని డిపో కల్తీకల్లుకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. రూ. 10కి లభించే సీసాలో ఒకరకంగా, రూ.20కి లభించే కల్లు సీసాలో మరో రకమైన మత్తు ఉంటుందంటారు మందుబాబులు. ఈ మత్తెక్కించే కల్లు కోసం నిత్యం బాన్సువాడ, కొల్లూర్, సోమేశ్వర్, దేశాయిపేట్‌తోపాటు పలు గ్రామాలనుంచి నడుచుకుంటూ కొందరు, మోటార్ సైకిళ్లపై మరికొందరు దుర్కికి వస్తుంటారు. తిరిగి వెళ్లేటప్పుడు రెండు, మూడు కల్లు ప్యాకెట్లను వెంట తీసుకువెళ్తారు.

కల్లు సేవించిన పలువురికి అస్వస్థత

దుర్కి డిపో నుంచి సోమవారం అంకోల్, దుర్కి, దామరంచ గ్రామాల్లోని దుకాణాలకు కల్లు సరఫరా అయ్యింది. ఆ కల్లు తాగిన పలువురు కళ్లు తేలేయడం, మెడలు పడేయడంతో కుటుంబ సభ్యులు వెంటనే బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న సమయంలో ఒక్కొక్కరిగా బాధితులు పెరుగుతుండడంతో అప్రమత్తమైన డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య వెంటనే అంకోల్ గ్రామానికి వెళ్లారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలతో మాట్లాడారు. స్థానిక గ్రామ పంచాయతీ వద్ద మందులను అందుబాటులో ఉంచి, ప్రథమ చికిత్స అనంతరం బాధితులను అంబులెన్సులో బాన్సువాడకు పంపించాలని సూచించారు. సోమవారం రాత్రి వరకు బాధితుల సంఖ్య 60 కు చేరింది. ఇందులో 12 మందిని మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని జీజీహెచ్‌కు తరలించారు. బాధితులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పరామర్శించారు. పలువురు బాధితులకు ఆర్థిక సాయం అందించారు.

పట్టించుకోని అధికారులు

దుర్కి కల్లు డిపో నుంచి సుమారు 7 గ్రామాలకు కల్లు సరఫరా చేస్తారు. డివిజన్‌లో ఎక్కువగా కల్తీ కల్లును దుర్కిలోనే అమ్ముతున్నారనే విషయం బహిరంగ రహస్యం. బాన్సువాడకు కూతవేటు దూరంలో ఉన్న దుర్కిలో క్లోరోఫాం, ఇతర మత్తు పదార్థాలు కలుపుతున్నారనే విషయం సంబంధిత శాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. తాజా ఘటనతోనైనా అధికారులు మేల్కొని కల్తీ కల్లు విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నివేదిక పంపిస్తున్నాం

అంకోల్ గ్రామ కల్లు దుకాణంపై విచారణ చేపట్టాం. కల్లును పరీక్షించగా సీహెచ్ శాతం లేదు. మరేదైనా మత్తు పదార్థం ఉందేమో అన్న అనుమానంతో శాంపిల్స్ సేకరిస్తున్నాం. కౌంటర్ నెం.5 నాగరాజు గౌడ్ దుకాణంపై చర్యలు తీసుకుంటాం. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తాం.

– యాదిరెడ్డి, బాన్సువాడ ఎక్సైజ్ సీఐ

వివరాలు సేకరించాం

కల్తీకల్లు తాగి అస్వస్థతకు గురైన వారి వివరాలు సేకరించాం. నస్రుల్లాబాద్ మండలం అంకోల్ గ్రామంలో ఘటనా స్థలాన్ని పరిశీలించాం. అంకోల్, అంకోల్ తండాకు చెందిన బాధితులను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నాం.

– సాయిలు, ఆర్ఐ, నస్రుల్లాబాద్

లైసెన్సులు రద్దు చేయండి

కల్తీ కల్లు దుకాణ యజమానుల లైసెన్సులు రద్దు చేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదేశించారు. సోమవారం కల్తీకల్లు తాగి అస్వస్థతకు గురైన దుర్కి, అంకోల్, అంకోల్ తండా, దామరంచ గ్రామాలకు చెందిన బాధితులను బాన్సువాడ ఆస్పత్రిలో పరామర్శించారు. కల్లు తాగిన తర్వాతే తాము అస్వస్థతకు గురయ్యామని బాధితులు చెప్పారు. విచారణ జరిపి కల్లు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ హన్మంత్‌రావుకు సబ్‌కలెక్టర్ సూచించారు. ఆస్పత్రిలో ఆర్ఎంవో అందుబాటులో లేకపోవడంతో ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాత్రి వేళలో సబ్ కలెక్టర్ ఆయా గ్రామాల్లో పర్యటించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

క్లుప్తంగా

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానిక 73 ఫిర్యాదులు వచ్చాయి. భూ సమస్యలు, రెండు పడకల ఇళ్ల మంజూరు, రైతు భరోసా, ఫించన్లు మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు ఎక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినతులు పెండింగ్‌లో లేకుడా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో చందర్, ఆర్డీఓ వీణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఔదార్యం



కామారెడ్డి క్రైం: రోడ్డు పక్కన పడిపోయిన ఓ వ్యక్తిని పోలీసులు ఆస్పతికి తరలించి చికిత్స అందించారు. పట్టణంలోని ఎన్‌జీవోఎస్ కాలనీలోని సెల్ టవర్ వద్ద ఓ వ్యక్తి రోడ్డు పక్కన అపస్మారకస్థితిలో పడిఉన్నాడు. కానిస్టేబుళ్లు అరుణ్, రాజిరెడ్డిలు అతడిని గుర్తించి తమ వాహనంలో జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందేలా చేశారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): గ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ అన్నారు. ఆయన సోమవారం మండలంలోని కృష్ణాజీవాడి, బ్రహ్మజీవాడి గ్రామాలలో పర్యటించి నర్సరీని పరిశీలించారు. ప్రతిరోజు మొక్కలకు నీటిని పట్టాలని నిర్వాహకులకు సూచించారు. జీపీ సిబ్బంది, నర్సరీ నిర్వాహకులు ఉన్నారు.

శత శాతానికి అడుగుదూరంలో..

- 98శాతం ఇంటి పన్ను వసూలు
- లక్ష్యాన్ని పూర్తి చేయడంపై దృష్టి సారించిన అధికారులు



చిన్నమల్లారెడ్డిలో పన్ను వసూలు చేస్తున్న జీపీ సిబ్బంది

కామారెడ్డి రూరల్: ప్రజలు చెల్లించే పన్నుల ఆధారంగా గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయి. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న 14వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్ఎఫ్‌సీ నిధులతోపాటు గ్రామాల్లో ఇంటి పన్నులతోపాటు వాణిజ్య సముదాయాలు చెల్లించే పన్నులు కీలకంగా మారాయి. ప్రజలకు వసతులు కల్పించాలంటే ఇందుకు అవసరమైన నిధుల కోసం గ్రామల్లో ప్రతి సంవత్సరం ఇంటి పన్ను వసూలు చేస్తారు. ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆయా మండలాల్లోని గ్రామాల్లో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో ఇంటింటికి తిరుగుతూ ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 98.06 శాతం పన్ను వసూలైందని అధికారులు తెలిపారు.

ఇంటింటికి తిరుగుతూ..

పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వ నిధులతోపాటు పన్నులే ప్రధాన ఆదాయ వనరు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణకు పన్నుల రూపంలో వచ్చిన నిధులను ఖర్చు చేస్తారు. వందశాతం పన్నుల వసూలుకు జిల్లా స్థాయి అధికారులు తరుచూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ కూడా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పన్నుల వసూలుపై దృష్టి సారించారు. సర్పంచులు పదవీకాలం ఉండగా పంచాయతీ కార్యదర్శులతో కలిసి గృహాలవారిగా తిరుగుతూ పన్నులు వసూలుకు చర్యలు చేపట్టేవారు.

ప్రత్యేకాధికారుల పాలనలో....

సర్పంచుల పదవీకాలం ముగిసి..ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్న ఈ సమయంలో పంచాయతీల్లో పన్నుల వసూలుకు గడువు ముగిసింది. 2024–2025 ఆర్థిక సంవత్సరం ముగిసి వారం రోజులు గడుస్తుండడంతో అధికారులు వందశాతం లక్ష్యం చేరుకోవడంపై దృష్టి సారించారు. , మరో వారం రోజుల్లో లక్ష్యాన్ని చేరుకుంటామని సంబంధిత అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జీపీలు	పన్ను వసూలు లక్ష్యం	వసూలైంది	శాతం	వసూలు కావాల్సింది
536	రూ. 14,67,69,766	రూ.14,49,82,541	98.69	రూ. 17,87,225

వందశాతం వసూలు చేస్తాం



గ్రామ పంచాయతీల్లో 100 శాతం పన్నులు వసూలు చేస్తాం. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే పన్నుల రూపంలో వచ్చిన నిధులతో అభివృద్ధి పనులు చేపట్టవచ్చని గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతేకాకుండా గ్రామ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ పన్నుల వసూలుకు కృషి చేస్తున్నారు. వారం రోజుల్లో 100 శాతం పన్నుల వసూలు లక్ష్యాన్ని చేరుకుంటాం.

– మురళి, డీపీవో, కామారెడ్డి

నాసిరకం సరుకులను విక్రయిస్తే చర్యలు తప్పవు

- జిల్లా ఫుడ్ సెక్యూరిటీ అధికారిణి సునీత



గోపాల్‌పేటలో తనిఖీ చేస్తున్న సునీత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): దుకాణాలలో నాసిరకం సరుకులను విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ సెక్యూరిటీ అధికారిణి సునీత సూచించారు. గోపాల్‌పేటలోని పలు దుకాణాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాలలోని పలురకాల సరుకులను ఆమె పరిశీలించారు. గోపాల్‌పేటలోని రాజరాజేశ్వర కిరాణ దుకాణంలో కాలంచెల్లిన సాంబార్‌పొడి ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించామని ఆమె చెప్పారు. దీంతోపాటు అదే దుకాణంలో నాసిరకం పల్లీలు విక్రయిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించి రాజరాజేశ్వర దుకాణంలో శాంపిళ్లను సేకరించామని ఆమె వివరించారు. కాలం చెల్లిన, నాణ్యతలేని సరుకులను విక్రయిస్తే దుకాణాదారులపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. గతఏడాది జిల్లాలో నాసిరకం సరుకులను విక్రయిస్తున్న దుకాణాల్లో సేకరించిన శాంపిళ్లకు సంబంధించి 6కేసులు నమోదయ్యాయని ఆమె వివరించారు. ఇప్పటివరకు ఒక కేసు నమోదైందని ఆమె చెప్పారు. కాగా మండలకేంద్రం గోపాల్‌పేటలో ఫుడ్ సెక్యూరిటీ అధికారిణి ఆకస్మిక తనిఖీల విషయం తెలుసుకున్న కొందరు వ్యాపారులు వారి దుకాణాలను మూసి ఉంచారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: వరంగల్ జిల్లా ఎల్కతుర్తి లో ఈనెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి లోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ సభకు కామారెడ్డి నియోజకవర్గం నుండి 3 వేల మంది కార్యకర్తలను తరలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. పార్టీ సూచించిన దాని కంటే ఎక్కువ మంది కార్యకర్తలను సభకు తరలించాలని ఆయా మండలాల నాయకులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, జెడ్పీ మాజీ సభ్యులు మినుకూరి రాంరెడ్డి, గంద్ర మధుసూదన్, మాజీ ఎంపీపీలు బాలమణి, పిప్పిరి ఆంజనేయులు, పార్టీ అధికార ప్రతినిధులు బల్వంత్ రావు, గైని శ్రీనివాస్ గౌడ్ నాయకులు గోపీ గౌడ్, నల్లవెల్లి అశోక్, మోహన్ రెడ్డి, ప్రభాకర్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, భాను, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే



సిర్పూర్‌లో సన్నబియ్యం లబ్ధిదారు ఇంట్లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ కిరణ్మయి

మద్నూర్/బిచ్కుంద/నిజాంసాగర్ (జుక్కల్): రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో, మాగి గ్రామంలో. బిచ్కుందలో సోమవారం వరి, పొద్దుతిరుగుడు పంట కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. డోంగ్లీ తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. డోంగ్లీ మండలంలోని సిర్పూర్‌లో ఎమ్మెల్యే సన్న బియ్యం లబ్ధిదారు నామేవార్ లక్ష్మణ్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో మధ్యాహ్న భోజనం చేశారు. ఆయనతో పాటు సబ్‌కలెక్టర్ కిరణ్మయి, అధికారులు కూడా భోజనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బిచ్కుంద మున్సిపాలిటీతో పాటు 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. బిచ్కుంద అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులు రానున్నాయన్నారు. డోంగ్లీ, బిచ్కుంద మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేపట్టారు. రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదం ప్రతి ఇంటికి చేరే విధంగా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేటలోని జగ్గనిచెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్‌పేటలోని ప్రధాన రహదారికిరువైపులా ఉన్న ఇళ్ల నుంచి వెలువడే మురుగు, వ్యర్థపదార్థాలు పోచారం ప్రధాన కాలువలో కలపడంతో తమ గ్రామసమీపంలోని జగ్గనిచెరువునీరు కలుషితమవుతుందన్నారు. దీంతో పలువురు జీవనాధారం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం నీరుపారుదలశాఖ ఏఈ శ్రీకాంత్‌కు సైతం వినపత్రాన్ని సమర్పించారు.

ప్రమాదకరంగా మారిన స్పీడ్ బ్రేకర్లు

మండల కేంద్రంలోని బస్టాండులో ఇటీవల ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా మారాయని ప్రయాణికులు,ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కొంచెం ఏటవాలుగా ఏర్పాటు చేస్తే బాగుండేదని పలువురు డ్రైవర్లు అభిప్రాయ పడ్డారు. స్పీడ్ బ్రేకర్ ఎత్తుగా ఉండటంతో తరుచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. శనివారం కరీంనగర్ డిపోనకు చెందిన ఈ ఎక్స్ ప్రెస్ స్పీడ్ బ్రేకర్ వద్ద ఆగిపోయింది. కొంచెం స్పీడ్ గా వెళ్తే ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుందని, స్లో గా వెళ్తే బస్సులు ఆగిపోతున్నాయని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం స్పీడ్ బ్రేకర్ దాటేప్పడు పలువురు ప్రయాణికులు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. వెంటనే అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల ఎత్తు తగ్గించాలని ప్రజలు కోరారు.

- మాచారెడ్డి



మాచారెడ్డి బస్టాండ్‌లో ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



రామారెడ్డి/దోమకొండ: రామారెడ్డి మండలకేంద్రంలో, దొమకోండ మండలం అంచనూరు, సీతారాంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం జై భీమ్, జై బాబు జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కాంగ్రెస్ నాయకులు చేపట్టారు.రామారెడ్డిలో అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో రామారెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శిలాసాగర్, మైనారిటీ మండల అధ్యక్షుడు ఇర్ఫాన్, దోమకొండ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు రామస్వామి గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాజం, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పేస్ ఇంజినీరింగ్‌పై అవగాహన



భిక్కనూరు/మాచారెడ్డి : విద్యార్థులు ఉపగ్రహాల పనితీరు, వాటితో కలిగే లాభాలపై అవగాహన పెంచుకోవాలని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ రిటైర్డ్ ఇంజినీర్ డాక్టర్ రఘువర్మ అన్నారు. సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన స్పేస్ ఇంజినీరింగ్‌పై ఆయన అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు స్పేస్ ఇంజినీరింగ్‌పై అవగాహన కల్పిస్తే రాణిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజగంగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఎంఈవో రాంమనోహర్ రావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి

ఎడపల్లి(బోధన్): చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి వలకు చిక్కుకొని, నీటమునిగి మృతి చెందాడు. ఎస్సై వంశీచందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్‌కు చెందిన శ్రీనివాస్ (28) బోర్‌బండి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ములుగు జిల్లా నుంచి ఇక్కడకు వచ్చి 18ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నాడు. పనిలేనప్పుడు చేపలు పట్టడానికి వెళుతుండేవాడు. ఈక్రమంలో ఆదివారం ఉదయం చేపల వేటకని స్థానిక చెరువు వద్దకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు వల వేయగా, అదే వలకు చిక్కుకొని నీటమునిగి మృతిచెందాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్నానానికి వెళ్లి చెరువులో పడి ఒకరు..



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఓ యువకుడు స్నానం చేయడానికి చెరువుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన చింతకాయల చరణ్(18)కు మతిస్థిమితం సరిగా ఉండదు. సోమవారం ఉదయం అతడు స్థానిక ఊర చెరువులో స్నానం చేయడానికి వెళ్లి, ఇంటికి తిరిగిరాలేదు. దీంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకు వెళ్లగా అతడి దుస్తులు ఒడ్డున ఉండటంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న ముప్కాల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పదేళ్ల క్రితం ఇద్దరు కుమారులు..

కొత్తపల్లి గ్రామానికి చెందిన చింతకాయల రవి, రజిత దంపతులకు మొత్తం నలుగురు కుమారులు. వారిలో ఇద్దరు కుమారులు గత పదేళ్ల క్రితం ఊర చెరువు నుంచి ప్రవహించే కాలువలో పడి మృతి చెందారు. పెద్ద కుమారుడైన చరణ్ చెరువులో పడి మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

నల్లమడుగులో క్షుద్ర పూజల కలకలం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు ఉన్నత పాఠశాలలో క్షుద్రపూజల కలకలం రేపింది. పాఠశాలకు శని, ఆదివారాలు సెలవులు రావడంతో గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాలలోని ఓ గది వద్ద ముగ్గు వేసి పసుపు, కుంకుమ, అరటిపండ్లు, నిమ్మకాయలతో పట్టు వేసినట్లు బొమ్మలను వేశారు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఈ దృశ్యాన్ని చూసి భయాందోళనకు గురయ్యారు. ఈ విషయం గ్రామంలో తెలియడంతో చర్చనీయాంశంగా మారింది. గ్రామస్తులు, కార్యదర్శి, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలతో చర్చించి లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని కాటేపల్లి గ్రామ శివారు మీదుగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై మహేందర్ సోమవారం తెలిపారు. కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను తహసీల్దార్ దశరథ్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

హాస్టల్ నుంచి ఇద్దరు విద్యార్థుల మిస్సింగ్

బాన్సువాడ: బీర్కూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల– హాస్టల్ నుంచి 8వ తరగతి చదివే ఇద్దరు విద్యార్థులు మిస్సింగ్ అయినట్లు ప్రిన్సిపాల్ శివకుమార్ తెలిపారు. ఈమేరకు అతడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోటి స్నేహితులను విచారించగా సదరు విద్యార్థులు కిష్టాపూర్‌లో యూనిఫామ్ మార్చుకుని గొరారం గ్రామంలోని తోటి స్నేహితుడి దగ్గరకు వెళ్లినట్లు తెలిపారు. ఆ గ్రామం పరిసర ప్రాంతంలో వెతుకగా వారి ఆచూకీ దొరకలేదన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళపై వ్యక్తి దాడి

- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- కొడుకును కిడ్నాప్ చేసిందనే అనుమానంతో ఘాతుకానికి పాల్పడిన నిందితుడు
- చందానాయక్ తండాలో ఘటన



వివరాలు సేకరిస్తున్న సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సై ఆంజనేయులు

గాంధారి(ఎల్లారెడ్డి): తన కొడుకును కిడ్నాప్ చేసి, దాచిందనే అనుమానంతో ఓ మహిళపై నిందితుడు దాడి చేయగా, తీవ్ర గాయాలతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. చందానాయక్ తండాకు చెందిన కేతావత్ పిరాజీ గత కొన్నేళ్లుగా హైదరాబాద్ బేగంపేట్‌లో ఉంటూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అదే ప్రాంతంలో అమీనా బేగం (35) కూడా భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. పిరాజీ కుమారుడు నాలుగేళ్ల వయస్సుగల శ్రీకాంత్ కొన్ని రోజులుగా కనిపించకుండా పోయాడు. అమీనా బేగం తన కుమారుడిని కిడ్నాప్ చేసి దాచిందనే అనుమానంతో పిరాజీ ఆమెను ఇటీవల చందానాయక్ తండాకు తీసుకొచ్చాడు. ఆమెను తన కొడుకును ఎక్కడ దాచావో చెప్పాలని ప్రశ్నించాడు. ఆమె వివరాలు చెప్పలేదు. ఈక్రమంలో తండా సమీపంలోని మేడిపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి విచక్షణా రహితంగా కర్రలతో కొట్టాడు. అనంతరం అక్కడి నుంచి అతడు వెళ్లిపోయాడు. ఆమెకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి గాంధారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. మేడిపల్లి మాజీ సర్పంచ్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్ విచారణ చేస్తున్నారని ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో ఒకరి ఆత్మహత్య



బోదాసు రాజు (ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కాలనీకి చెందిన బోదాసు రాజు (35) కూలీ పని చేసుకుంటూ జీవించేవాడు. అతడికి లక్ష్మీతో 13 ఏళ్ల క్రితం వివాహం జరుగగా, ఇద్దరు సంతానం ఉన్నారు. దంపతుల మధ్య గొడవలు జరుగడంతో లక్ష్మి కొద్దిరోజులుగా తన తల్లిగారింటి వద్దనే ఉంటోంది. దీంతో రాజు మద్యానికి బానిసై, భార్య కాపురానికి రావడం లేదని మనస్థాపం చెందేవాడు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి అతడు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు అతడిని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి అన్న యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వడియారం–మిర్జాపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య ప్రాంతంలో సోమవారం ఉదయం వెలుగుచూసింది. పట్టాలపై మృతదేహం పడి ఉందని సమాచారం రావడంతో కామారెడ్డి రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి ఎడమ చేతికి వెండి కడియం, ఛాతిపై కుడి వైపున పుట్టు మచ్చ ఉన్నాయని రైల్వే పోలీసులు తెలిపారు. ఆనవాళ్లు తెలిసిన వారు కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలని, కేసు విచారణ అధికారి హన్మాండ్లు కోరారు.

డబ్బుల కోసం చాకుతో బెదిరింపు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని పద్మాజివాడి గ్రామ శివారులోగల 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు డబ్బుల కోసం చాకుతో ఓ లారీ డ్రైవర్‌ను బెదిరింపులకు గురిచేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. హైదరాబాద్ నుంచి మధ్యప్రదేశ్‌కు వెళ్తున్న లారీని డ్రైవర్ భోజనం చేయడానికి ఆదివారం రాత్రి పద్మాజీవాడి శివారులో రోడ్డు పక్కన నిలిపాడు. అదే సమయంలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి డబ్బులు ఇవ్వాలని లారీలో ఉన్న వ్యక్తులను చాకుతో బెదించారు. ఒకరిని గాయపర్చి, రెండు సెల్‌ఫోన్‌లను ఎత్తుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఇందల్వాయి: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇటీవల పట్టుబడ్డ ఓ వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మనోజ్ తెలిపారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో గతవారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో వెంగల్‌పాడ్ గ్రామానికి చెందిన లావుడ్య రాజు మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

నవీపేట మండలంలో..

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై వినయ్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన బట్టు నరేష్(32) గ్రామపంచాయతీలో వాటర్‌మెన్‌గా విధులు నిర్వహించేవాడు. నరేష్ అవసరం నిమిత్తం తన తండ్రికి రూ. 500లు ఇవ్వమని అడిగాడు. కానీ తండ్రి డబ్బులు ఇవ్వడానికి నిరాకరించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన నరేష్ సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న ఆర్మీ పారా గ్లైడింగ్



విన్యాసకులతో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్..



పారాగ్లైడింగ్ విన్యాసాలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం ఆర్మీ అధికారుల నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 250వ ఏవోసీ కార్ప్స్ డేను పురస్కరించుకుని సికింద్రాబాద్ ఆర్మీ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో పారా మోటార్ ఎక్స్‌పెడిషన్– 2025 యాత్ర చేపట్టారు. ఢిల్లీ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఆగ్రా, కాన్పూర్, ఝాన్సీ, సాగర్, జబల్‌పూర్, పుల్గాం మీదుగా సోమవారం సాయంత్రం నిజామాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారికి అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆర్మీ కంటోన్మెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అమత్ నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు అలరించాయి. ఎన్‌సీసీ కెడెట్లు, యువతీయువకులకు పారా గ్లైడింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎస్‌వో అరవింద్ రెడ్డి, సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్ రెడ్డి, పోలీసు, ఎన్‌సీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.